www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 15 జులై 2023

5



చోడవరంలో భూసర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామాల్లో జరుగుతున్న జగనన్న భూ సర్వే పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చోడవరం గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల వివరాలను స్థానిక అధికారులను అడిగికలెక్టర్ హిమాన్షు శుక్లా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని భూములను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర సర్వే పనులు పూర్తయ్యాయని తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట రామచంద్రపురం ఆర్‌డిఒ పి.సింధు, తహశీల్దార్ తేజేశ్వరరావు, ఎంపిడిఒ సెలెట్ రాజు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి వేణుతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

రైతుల సమస్యలపై అధికారుల నిలదీత

తూతుమంత్రంగానే జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జెడ్‌పి కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రైతుల సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. జెడ్‌పి సమావేశం అని పెట్టి రైతుల సమస్యలపై శ్రద్ధ చూపడం లేదని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి జిల్లా అని చెప్పి కేవలం కాకినాడ జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే నివేదికలో పొందుపర్చారన్నారు. కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డుల లెక్కల వివరాలు కూడా సమగ్రంగా ఇవ్వలేదన్నారు. జూన్ ఒకటనే కాలువల ద్వారా నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నా నేటికీ అనేక చోట్ల నారుమళ్లు కూడా సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గతేడాది కూడా ఇదే మాట చెప్పినప్పటికీ సకాలంలో నీటి విడుదల లేకపోవడంతో అపరాల సాగు జరగలేదన్నారు. సమావేశాల్లో అధికారులు చెబుతున్న అంశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదన్నారు. చిరుధాన్యాల సాగుపై మాటల్లో తప్ప ఆచరణలో శ్రద్ధ కనబరచడం లేదన్నారు. ఈ సందర్భంగా 31 అంశాలను పొందుపరచగా వ్యవసాయ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, గృహ నిర్మాణ సంస్థ, ఆర్ అండ్ బి, విద్యా, ఉపాధి హామీ తదితర 8 అంశాలను మాత్రమే సమావేశంలో చర్చించి మమ అనిపించారు. పిఆర్ ఇంజనీరింగ్ శాఖపై మొక్కుబడిగా కానిచ్చారు. విద్యుత్ శాఖపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు అప్రకటిత కరెంటు కోతలపై ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

కౌలు రైతుల చట్టం ప్రకారం భూ యజమాని సంతకం ఉంటేనే సిసిఆర్ కార్డు జారీ చేస్తుండడం వల్ల వాస్తవ సాగుదారుడికి తీవ్ర నష్టం జరుగుతుందని, పలువురు రైతులు అప్పుల పాలవుతున్నారని సమావేశంలో కొందరు జెడ్‌పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. తారతమ్యం లేకుండా పూర్తిస్థాయిలో అందరికీ సిసిఆర్ కార్డులు జారీ చేయాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటి బాబు కోరారు. వాస్తవ సాగుదారుడికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విఆర్వో, వ్యవసాయ శాఖ అధికారుల సంతకాలతో ఐదేళ్ల కౌలుకు సాగు చేస్తున్న రైతులకు డిసిసిబి ద్వారా రుణాలు ఇచ్చే ప్రక్రియను కొత్తపేట నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు కొత్తపేట ఎంఎల్‌ఎ ప్రభుత్వ చీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలువలకు నీరు విడుదల చేసినా శివారు ప్రాంతాలకు అందడం లేదని అయినవిల్లి, రాజోలు, గండేపల్లి, రాజవొమ్మంగి, కె.గంగవరం, సామర్లకోట జెడ్‌పిటిసిలు చెప్పారు. తదితర ప్రాంతాలకు చెందిన జెడ్పిటిసిలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదైందని, ఇప్పుడిప్పుడే వానలు కురుస్తున్నాయని ఈ నేపథ్యంలో నారుమళ్లు కాకుండా నేరుగా వెదజల్లే పద్ధతిని అనుసరిస్తే బాగుంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీనిపై గ్రామసభలు పెట్టి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మెట్ట ప్రాంతాల్లో రాగి వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కూడా సరఫరా చేసినట్లు తెలిపారు. 10 వేల వరకు భూసార పరీక్షల నమూనాలు తీసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ జిల్లాలో కౌలురైతులకు గతేడాది 40 వేల సీసీఆర్‌సీ కార్డులు అందించామని, ఈసారి ప్రతి ఒక్క కౌలు రైతుకు కార్డు అందించి, త్వరితగతిన రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



కాకినాడ జెడి సమావేశంలోమాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి



జెడ్‌పి సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీజనల్ వ్యాధులపై చర్చ

డెంగీ నివారణ మాసోత్సవాలు సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు. సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ కట్టడికి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, పారిశుధ్య, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు, ఆసుపత్రుల్లో ర్యాపిడ్ కిట్ల అందుబాటు తదితరాలపై చర్చించారు. కాకినాడ రూరల్, కోటనందూరు తదితర ప్రాంతాల్లో ఫైలేరియా కేసులు నమోదవుతున్నందున జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి సర్వే చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

వాలంటీర్లకు భరోసా కల్పిస్తూ తీర్మానం

మహాత్మా గాంధీ కలలుగన్న నిజమైన గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సిఎం జగన్ తెచ్చిన విప్లవాత్మక వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ అని వాలంటీర్లపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వారికి పూర్తిభరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. వాలంటీర్లకు మేమున్నామంటూ భరోసా కల్పించేలా, ఈ వ్యవస్థను తీసుకొచ్చిన సిఎంకు ధన్యవాదాలు తెలిపేలా తీర్మానం చేయాలంటూ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు కోరగా దీనిపై మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సమావేశంలో మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపి వంగా గీత, కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, జెడ్‌పి వైస్ చైర్మన్ బుర్ర అనుబాబు పాల్గొని మాట్లాడారు.

49 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-అమలాపురం

గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు విడతలుగా భారీగా క్రీడలు 49 రోజులపాటు ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భారీ క్రీడలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ క్రీడా రంగాల్లో పోటీలు నిర్వహించేందు కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిర్ణయించిందని. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట ఈ క్రీడలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించిందన్నారు. వివిధ స్థాయిల్లో పోటీలను నిర్వహించేందుకు అధికారులు ప్రతిపాదించారన్నారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ ఆటలు జరగనున్నాయన్నారు 5 దశల్లో పోటీలను నిర్వ హించాలని ప్రతిపాదించబడిం దన్నారు. పురుషులు, మహిళల కోసం క్రీడా విభాగాలు, మ్యాచ్‌లు ప్రతిపాదించబడ్డాయన్నారు. ప్రతిపాదిత ఆట బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో వాలీబాల్. మారథాన్, యోగా, టెన్నికాయిట్ సాంప్రదాయ గేమ్‌లు వంటి ఇతర గేమ్‌లు కూడా ప్లాన్ చేయబడ్డాయని అన్ని పోటీలు నాకౌట్ విధానంలో ఆడతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం పాఠశాల విద్య, ఉన్నత విద్య గ్రామ సచివాలయం/వార్డు సచివాలయం, సాంఘిక సంక్షేమం, బిసి సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్, సమాచార పౌర సంబంధాలు క్రీడా శాఖలు కృషిచేయాలన్నారు. జిల్లా స్థాయిలో కార్యక్రమం నిర్వహించను న్నారని జిల్లా కలెక్టర్ , జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షులు తెలిపారు. ఆట మైదానాలను కనుగొనడం,వివిధ విభాగాలలో పనిచేస్తున్న సబార్డినేట్ సేవలను వినియోగించుకోవడం, రవాణా ఏర్పాటు చేయడం, సంస్థ కోసం పి ఇటిలు, పీడీలు చేయాలన్నారు. క్రీడలలో పాల్గొనేవారికి ఆహారం వసతి ప్రధాన విధులు చేపట్టాలన్నారు. పాల్గొనేవారి వయస్సు 17 సంవత్సరాల కంటే ఎక్కువ ఉండాలని పోటీలు పురుషులు మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తారన్నారు. స్థాయి/దశలో గెలిచిన జట్లు మాత్రమే తదుపరి స్థాయి/దశ మ్యాచ్‌లను ఆడతాయని. గ్రామం/వార్డు సచివాలయ స్థాయిలో ఏ విభా గంలోనైనా ఒకటి కంటే ఎక్కువ టీమ్‌లను ఎంపిక చేయడంలో జట్టు ఎంపిక మాత్రమే అనుమతించబడు తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల వినతి

ప్రజాశక్తి-అమలాపురం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో పలువురు ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్లతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయటంలేదన్నారు. ఆన్లైన్ వర్కులపై శిక్షణ లేకపోవడంతో ఆశా వర్కర్స్ తీవ్ర ఆందోళనకు, మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఆశావర్కర్స్‌ని రోజు విలేజ్ క్లినిక్, సచివాలయాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయటం, ఒపి వర్క్, అటెండర్ పనులు చేయించడం తో పాటు ఉదయం సాయంత్రం రెండు సార్లు రిజిస్టర్ లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారన్నారు. రికార్డ్స్ సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ వర్క్ లన్ని సొంత ఫోన్ ద్వారా చేయాలని వేధిస్తున్నారని అన్నారు. శెలవులు లేకపోవడంతో అనారోగ్యాలపాలౌతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.



వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

జాబ్‌మేళాలో 225 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

ఎపి రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మిరియం కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమలాపురం ఆర్‌డిఒ వసంత నాయుడు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వసంతలక్ష్మి, డిఎస్‌డిఒ, ఎపి ఎస్ఎస్‌డిసి లోకమాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా నందు సుమారు 670 మంది హాజరు కాగా 225 మందికి ఉద్యోగం కల్పించామని లోకమన్ తెలిపారు. స్థానిక మిరియం డిగ్రీ కళాశాల నందు ఎపి ఎస్-ఎస్‌డిసి-స్కిల్ హబ్ ద్వారా నిర్వహిస్తున్న ఫ్రీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రామ్ ఎంఎల్‌సి బొమ్మి ఇశ్రాయెల్ ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకమాన్, ఎడిఎస్‌డిఇ.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి వాసు

ఉపాధి హామీ పనుల్లో బాధ్యతగా వ్యవహరించాలి


ప్రజాశక్తి-మండపేట

ఉపాధి హామీ పనుల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు, డ్వామా పిడి.మధుసూదన్ రావు, ఎపిడి సత్యనారాయణ, ఎస్ఆర్‌పి నాగ సత్యనారాయణల సమక్షంలో జరిగింది. మండలంలో 12 గ్రామాలకు సంబంధించి 2049 పనులకు రూ.9,49,90,009 పనులు జరిగాయన్నారు. 6705 జాబ్ కార్డులగాను 9421 మంది 266139 పని దినాలకు సగటున రూ.251 చెల్లించామని అధికారులు తెలిపారు. ప్రధానంగా మండలంలోని వివిధ గ్రామాల్లో చనిపోయిన వారి పేరు మీదుగా హాజరు వేయడం, ఫీల్డ్ లో పని లేకుండా నగదు చెల్లింపులు, పనికి రాని వారి పేరు మీదుగా హాజరు వేయడం తదితర అంశాలను గుర్తించారు. వీటికి సంబంధించి సుమారు రూ.15 లక్షల రికవరీకి కొంత సమయం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. డ్వామా పిడి.మధుసూదన్ రావు మాట్లాడుతూ జిల్లాలో 54 లక్షల పని దినాలకుగాను 42.61 లక్షల పని దినాలతో పాటు రూ.113 కోట్ల వేతనాలు చెల్లించడం జరిగిందని రూ.37కోట్ల మెటీరియల్ అందజేశామన్నారు.

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-అంబాజీపేట

బిసిల అభివృద్ధి టిడిపి తో సాధ్యమని శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అమలాపురం పార్లమెంటు శెట్టిబలిజ సాధికార కమిటీ కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సాధికార కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మరో ముఖ్యఅతిథి పి.గన్నవరం టిడిపి నియోజకవర్గ కన్వీనర్ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ సాధికార కమిటీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో బిసి పోరుబాట కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర బిసి సాధికార సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా నూతనంగా నియమించబడిన కుడుపూడి బుజ్జిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు మట్టపర్తి రామకష్ణ, తెలుగు రైతు కార్యదర్శి సంసాని పెద్దిరాజు, రాష్ట్ర బిసి విభాగం శెట్టిబలిజ సాధికార కమిటీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కుడుపూడి దుర్గారావు, రాష్ట్ర డైరెక్టర్ రెడ్డి సుధీర్, జిల్లా శెట్టిబలిజ సాధికార కమిటీ డైరెక్టర్ పిల్లి సత్తిబాబు, మేడిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

అన్నదాన భవన నిర్మాణానికి రూ.40 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో నిర్మిస్తున్న అన్నదాన భవనానికి హైదరాబాదుకు చెందిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారు శుక్రవారం రూ.40 లక్షల విరాళాన్ని ఆలయ చైర్మన్ రమేష్ రాజు, ఇఒ సత్యనారాయణ రాజుకు అందజేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి చిత్రపటం అందజేశారు.



దాతలకు స్వామివారి చిత్రంఅందజేస్తున్నదృశ్యం



ప్రజాశక్తి దినపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ సతీష్

ప్రజల పక్షపాతి 'ప్రజాశక్తి'

ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యలను వెలికితీసి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల పక్షపాతిగా ప్రజాశక్తి దినపత్రిక ఉంటుందని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ, వైసిపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. పొన్నాడ పుట్టిన రోజు సందర్భంగా ప్రజాశక్తి తీసుకొచ్చిన ప్రత్యేక సంచికను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలోని గ్రాండ్ పార్క్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో దీన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాశక్తి దినపత్రిక నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సమన్వయ కమిటీ కన్వీనర్ ఎన్.పావనమూర్తి, అమలాపురం డివిజన్ ఇన్‌ఛార్జి జి.భీమేశ్వరరావు, కోనసీమ జిల్లా కేంద్ర విలేకరి ఎ.సురేష్ కుమార్, విలేకర్లు జె.శ్రీనివాస్, జి.మల్లేశ్వరరావు, పి.బాలఆనందకుమార్, ఎన్.దుర్గారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భీమనపల్లి శ్రీ రంగనాయకమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచెం శ్రావ్య, ఆకుల తులసి, దాసరి రోషిత్‌లు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని ఆ పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతి అందజేసిసత్కరించారు.

సుస్థిరాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-అమలాపురం

సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా జిల్లా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం ప్రధాన కార్యదర్శి క్యాంప్ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తయిన భవనాలు అప్పగింత, ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి, ఎన్‌సిడి సర్వే, ప్రభుత్వ పథకాలు ఫోకస్ ద్వారా సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధన, పాఠశాల విద్య జగనన్నకు చెబుదాం కార్యక్రమాల పురోగతిపైన నూతనంగా చేపట్ట నున్న, ఆడుదాం ఆంధ్ర, కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సుస్థిరాభి వద్ధి లక్ష్యాలు సాధనకు ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య అందించడంలో పాటుగా మహిళా సాధికారతను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఒ వెంకటేశ్వర్లు, డిపిఒ కష్ణకుమారి డ్వామా పిడి ఎస్ మధుసూదన్, పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈలు చంటిబాబు కష్ణారెడ్డి, డి సి హెచ్ ఎస్ పద్మశ్రీరాణి, డి ఆర్ డి ఏ పి డి పి శివశంకర్ ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఈవో కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రాధాను కలిసిన బాలరాజు

ప్రజాశక్తి-అంబాజీపేట

పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు శుక్రవారం విజయవాడలో వంగవీటి రాధాను కలిశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు పక్కదోవ పట్టించడంతో నిధులు లేని తో సమస్యల పరిష్కరించలేని స్థితిలో ఉన్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

'దంగేరులో అమ్మఒడి'

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని దంగేరు హైస్కూల్లో శుక్రవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. నాలుగవ విడత జరిగిన కార్యక్రమం లో మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పంప నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డిసిఎంఎస్ డైరెక్టర్ పెట్ట శ్రీనివాస్, దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



ఐటాప్ అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ

'రాజారత్న కిట్స్'లో 'ఐ టాప్-23'కు ఆహ్వానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికకు రామచంద్రపురం లో రాజారత్న కిట్స్ కళాశాల శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఐడియల్ టెక్నికల్ అవార్డు ప్రోగ్రాం 2023 ను ప్రకటించింది. ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అక్టోబర్ 2న జరిగే కార్యక్రమంలో ఐ టాప్ అవార్డులతో సత్కరిస్తారని కళాశాల డైరెక్టర్ ఎం.పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుల ఎంపికకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిఇఒ తిరుమలరావు, ఎంఇఒ సోమిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ బర్ల, డైరెక్టర్ రామారావు, రవీందర్, శ్రీకాంత్, అవార్డుల ప్రదాన అధికారి సురేష్ కుమార్ తదితరులు హాజరై ప్రసంగించారు. దేశంలోని అధ్యాపకులను ప్రథమ పౌరులుగా గుర్తించాలనే లక్ష్యంతో కొనేళ్లగా కిట్స్ రాజారత్న కళాశాల ఐ టాప్‌అవార్డులను అందజేస్తుందన్నారు. గమనము మరియు యంత్రము అనే స్ఫూర్తితో రూపొందించిన కార్యక్రమాల్లో దేశ, విదేశాల నుంచి వచ్చిన ఇన్నోవేషన్ యంత్రాలను ఇక్కడ ప్రదర్శిస్తారని వివరించారు. దేశం నలుమూలలు నుంచి వచ్చిన అధ్యాపకుల ఆవిష్కరణలను పరిశీలించి అక్టోబర్లో అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

ఏడిదలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-మండపేట

ఏడిద గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వర రావులు శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో అందిస్తున్న వైద్య సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌బి, ఆర్‌బియెస్, హెచ్ఐవి, డెంగీ తదితర 15 రకాల ఉచిత పరీక్షలతో మందులు ప్రభుత్వం అందజేస్తార న్నారు. అనంతరం వైద్యులు డాక్టర్ వంశీ మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి వ్యాధులు నీటి నిల్వలు ద్వారా వ్యాపిస్తాయ న్నారు. పరిస రాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు, ఆల్ అవుట్ తదితర పరికరాలు వినియోగించుకో వాల న్నారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు పలివేల సుధాకర్, జానీ, పంచాయతీ కార్య దర్శి వీర్రాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అదానీ కేసు, వివేకానంద కేసుల సాగదీతలకన్నా.. మన సీరియల్స్ సాగుడు పెద్ద సాగదీతేం కాదొదినా..!!

'సురక్ష'లో ధ్రువీకరణ పత్రాల అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు.

మండపేట స్థానిక 15, 20 వార్డులకు సంబంధించి కౌన్సిలర్ గ్రంథి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు మీ ఇంటికే తలుపు తట్టి ఇస్తున్నారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అంతా సేవకులు అయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్ తో కలిసి లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోతంశెట్టి వరప్రసాద్ చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబీ, మలసాని సీతామహాలక్ష్మి, మారిశెట్టి సత్యనారాయణ, కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్, తాసిల్దార్ టి.ఆర్.రాజరాజేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ టి కనకరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొప్పిరెడ్డి పద్మావతి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు. **ఆలమూరు** అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని గుర్తించి సంక్షేమ పథకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ కె.జాన్‌లింకన్ అన్నారు. మడికి శివారు చిలకలపాడు, మోదుకూరు సర్పంచులు యు.లక్ష్మి మౌనిక చిన్నా, పెంటపాటి శ్యామల, వెంకన్న అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న 11 పథకాలకు సంబంధించి వాటి పరిధిలో ధృపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నల్లి రాజు, ఎఇలు పోశమ్మ, డి.శ్రీనివాస్, డిటిలు జానకి రాఘవ, జానకి రామయ్య, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, ఎఒ లక్ష్మీ లావణ్య తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండలంలోని ర్యాలీ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాల్లో శుక్రవారం సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పిటిసి సభ్యుడు సాయిబాబా, తహశీల్దార్ డివిఎస్.అనిల్ కుమార్, ఎంపిడిఒ నాతి బుజ్జి ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ధవీకరణ పత్రాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కష్ణమాచార్యులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు** జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాఉల అందిస్తున్నామని తహశీల్దార్ రియాజ్ హుస్సేన్ అన్నారు. పాశర్లపూడి సత్రంలో శుక్రవారం సర్పంచ్ కొనుకు ప్రేమ జ్యోతి అధ్యక్షతన జగనన్న సురక్ష పథకం కార్యక్రమం జరిగింది. అంకాని వీరాంజనేయులు, పాసర్లపూడి సత్రం చైర్మన్ కడలి రామకష్ణ, మాజీ సర్పంచ్ లు ముల్లేటి త్రిమూర్తులు, కొనుగు నాగరాజు, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి తదితరులు అన్నారు. శుక్రవారం కపిలేశ్వరపురం మండలంలోని టేకి లో గ్రామ సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.



మడికి అర్హులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న తహశీల్దార్ ఐపి శెట్టి



పాశర్లపూడిలో ధృవీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన బద్రి దివ్య రమ్య (20) శుక్రవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ వివాదాల వల్ల రమ్య ఆత్మహత్య చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. పేరూరు గ్రామానికి చెందిన రమ్యకు రెండేళ్ల క్రితం నల్లమిల్లికి చెందిన బద్రి గంగరాజుతో వివాహం అయ్యింది. వీరికి ఇంతవరకు సంతానం కలగలేదు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ అందే పరదేశి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

చిత్రహింసలు తాళలేక భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి-అయినవిల్లి

మద్యానికి బానిసై చిత్రహింసలు పెడుతున్న భర్తను భరించలేక కడతేర్చిన భార్య ఈ సంఘటన మండలంలోని ఆయనవిల్లిలంక గ్రామంలో చోటు చేసుకుంది ఇసుకపట్ల రామకష్ణ (36) మద్యానికి బానిసై రోజు తాగివచ్చి భార్యతో పాటు తల్లిదండ్రులతో గొడవ పడుతూ కొడుతుండేవాడు. రోజులాగే రాత్రి కూడా గొడవ పడటంతో విసిగిపోయిన భార్య భర్త తలపై చెంబుతో బలంగా మొదడంతో రక్తపు మడుగులో పడి చనిపోయాడు. సిఐ ప్రశాంత్ కుమార్, ఎస్ఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసకుంది. అదే గ్రామానికి చెందిన మెట్టేటి చిట్టెమ్మ (75) రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుండి జగ్గంపేట వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పెద్దాపురం తరలించినట్లు తెలిపారు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రౌతులపూడి

రైతులపూడిలో శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. చాకిరేవుపాలెం గ్రామానికి చెందిన సతీష్, ప్రసాద్ యువకులు చెరో బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలు పాలైన యువకులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.

ఆటోను బైకు ఢీకొని నలుగురికి..

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి హరిత కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆటోలను బైకు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బైకుపై వెళుతుండగా ఎదురుగా పశువులు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరు విద్యార్థులు, ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో స్థానికులు, పోలీసులు వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం గ్రామం శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పేకాట శిబిరంపై సమాచారం అందుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పిఠాపురంలో 'ఇంటింటికీ వర్మ'

ప్రజాశక్తి-పిఠాపురం

టిడిపి ప్రభుత్వ హయాంలోనే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మరొక్కసారి తనకు ఎంఎల్ఎగా మరో అవకాశం ఇవ్వాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎంఎల్ఎ వర్మ ప్రజలు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో వర్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి శుక్రవారం మన ఇంటికి మన వర్మ కార్యక్రమం చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర కోటగుమ్మం సెంటర్, మార్కెట్ సెంటర్, చర్చి సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగింది.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదగాలని ఇస్రో విశ్రాంతి శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరునిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఉన్నత లక్షలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం గురించి వివరించారు. పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బలరామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు, ఎంవిఎస్.రామకృష్ణ, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీహరిరావు, బి.సంపత్ కుమార్, పి.ధనలక్ష్మి, జి.మేరీ విజయకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి -కరప

కరప గ్రామం రామకంచి రాజు నగర్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ 148లో అంగన్వాడి సహాయకురాలు పోస్టుకు ఖాళీ ఏర్పడిందని ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. ఎస్‌సి కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఈ దరఖాస్తులను కాకినాడ ఐసిడిఎస్‌లో ఈ నెల 17వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. గొర్రిపూడి, వేములవాడ, కూరాడ గ్రామాల్లో వాలంటీర్ పోస్టులు ఒక్కొక్కటి చెప్పున ఖాళీలు ఉన్నాయని ఆ గ్రామాలలో ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఒ తెలిపారు. ఈ పోస్టులను ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కరప మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరిస్తామని తెలిపారు.

యానాం వార్తలు


శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు, ఎంఎల్ఎ అశోక్

కో- ఆపరేటివ్ సిబ్బందికి ఎంఎల్ఎ సంఘీభావం

ప్రజాశక్తి -యానాం

నాలుగు రోజులుగా తమకు బకాయి వేతనాలు చెల్లించాలంటూ కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేపట్టిన నిరాహార దీక్షకు పలు పార్టీలు, సంఘాల నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక నెల జీతం రాకపోతేనే ఇబ్బందులు ఎదుర్కొనే ఈ రోజుల్లో 30 నెలల వేతనాలు అందించకపోవడం బాధాకరమన్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. లిక్కర్ స్టోర్స్‌లో రూ.లక్షల అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోపరేటివ్ ప్రెసిడెంట్ సిబ్బంది పట్ల కక్షతో వ్యవహరిస్తూ స్టోర్స్‌ను భ్రష్టు పట్టించారన్నారు. అనంతరం భాజపా నాయకులు కోపరేటివ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోరుతూ పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి మాట్లాడారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కార్యకర్తలు దీక్ష శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం పండు సిద్ధార్థ కుమార్ డివివి సత్యనారాయణ, హరిచంద్ర, లంకే లోవరాజు, సబ్బతి లోకేష్, ఎం.లోవరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కనకాల రాజు, ఎన్ఆర్ కాంగ్రెస్ నాయకుడు శామ్యూల్, నక్కల సుబ్బన్న, కనకాల కృష్ణ, కామిశెట్టి కమలాకర్ నాయుడు, వేణుగోపాల్, చెక్కల అరుణ్ కుమార్, బి.నాగేశ్వరరావు, కనకాల నాని, శ్యామ్, ప్రిన్స్ కుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

శారదాదేవికి సారె అందజేత

ప్రజాశక్తి - యానాం

ఆషాడ మాసం సందర్భంగా స్థానిక గోపాల్ నగర్‌లో ఉన్న ఉన్న శారదా దేవి ఆలయంలో అమ్మవారికి మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పిండి వంటలు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మహిళలు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

బిసి బాలుర హాస్టల్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే బిసి బోయ్స్ హాస్టల్‌ను పున్హ ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యానాంలో ఉన్న 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు కోసం వెల్ఫేర్ ఆఫీసర్ చింతా రామజోగిని సంప్రదించాలన్నారు.

గోదావరి వరదలపై సమీక్ష

ప్రజాశక్తి - యానాం

గోదావరి వరదలపై సమీక్ష సమావేశాన్ని ఆర్ఎఒ మునిస్వామి అన్ని శాఖల అధికారులతో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ఎఒ మునిస్వామి మాట్లాడుతూ వరదలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు లక్ష్య సాధనతో కృషి చేయాలని సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ చెప్పారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన ప్రాజెక్ట్ చేతన, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ డే కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడం విద్యార్థులకు ఎంతో గొప్ప సదవకాశమని సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. విద్యార్థులు తొలుత తమ ఇష్టాన్ని, అభిరుచులను గుర్తుంచుకొని వాటి కనుగుణంగా లక్ష్యాన్ని ఏర్పరచు కావాలని, తద్వారా మంచి కెరీర్ ఎంచుకోవాలని తెలిపారు. ప్రయత్నం చేయడంలో అలసత్వం కూడదని, ఆత్మవిశ్వాసంతో అనుకున్న కెరీర్‌లో రాణించాలని పేర్కొన్నారు. సమాజంలో అనేక కెరీర్‌లు ఉన్నాయని, వేటికవే ప్రత్యేకత కలిగి ఉన్నాయన్నారు. స్కూల్ కెరీర్ గైడెన్స్ ఆఫీసర్ జి.గోవిందు కెరీర్‌డే ప్రాముఖ్యత వివరించారు. ప్రతి నెలలో రెండవ మరియు నాల్గవ శుక్రవారం ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విషయం తెలిపారు.విద్యార్థులకు నెలలో రెండుసార్లు స్టడీ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. తోటకూర సాయి రామకృష్ణ, టీచర్లు వి.రాజు, కె.అరుణ, కెవివిసత్యనారాయణ, కె.శ్రీనివాస్, డివిఆర్ఎన్.వల్లి, బి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న జనసేన నాయకులు

కిర్లంపూడిలో పవన్‌కు పాలాభిషేకం

కిర్లంపూడి : కిర్లంపూడిలో జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ ఫోటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఉలిసి అయిరాజు మాట్లాడడారు. పవన్ కళ్యాణ్ ఏమన్నారో పూర్తిగా చూడాలని, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి శ్రీనివాస్, డేగల విజయ్, సత్యంశెట్టి వీర గణేష్, ఎంపిటిసి గోకేడ రాజ, ఎలుబండి శివ, పాలిశెట్టి సతీష్ ఉన్నారు.

లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వాలుతిమ్మాపురం రహదారిలో నిర్మించిన టిట్కో గృహాలు లబ్ధిదారులందరికీ వెంటనే అప్పగించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ టిట్కో గృహాలు నేటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. గృహాలు అప్పగించిన లబ్ధిదారుల్లో అధిక శాతం మంది టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఎంతో సంతోషంతో స్వంత గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు.ఈ గృహాల్లో పూర్తిస్థాయిలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయలేదన్నారు. మంచినీటి వాల్వులను ఆపరేట్ చేసే సిబ్బంది కూడా లేరన్నారు. 1700 గృహాలు ఉన్న ఈ కాలనీలో మంచినీటి సదుపాయం ,వీధిలైట్లు కల్పించకుంటే ప్రజలు ఎలా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు రైతుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడలో అక్కినీడి వారి చెరువు పుట్టకుంట కాలువపై తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో గ్రామ రైతులు వాసిరెడ్డి చిట్టిబాబు, కర్రెడ్ల బాపన్నదొర, విశ్వనాథం సత్తిబాబు, నామా రమేష్, సిరికి సూరిబాబు ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ షట్టర్లు తొలగించడంతో తమ గ్రామంలో పంటలకు నీరందక పంట నష్టపోతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరగ సత్యానందం, నామా పెద్దిరాజు, నామా సూరిబాబు, కొత్తెం నానాజీ, గరగ శేషుబాబు, కొత్తెం బుజ్జి, కాయల పవన్ పాల్గొన్నారు.

'రవీంద్రభారతి'లో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేటలో ఉన్న రవీంద్ర భారతి పబ్లిక్ పాఠశాలలో డివిజనల్ విద్యాశాఖ అధికారిని సుభద్ర శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు ఎక్కడ ఆటంకం రాకుండా వేరే పాఠశాలలో చేర్పిస్తామని ఆమె పేర్కొన్నారు. శ్రీ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ మూసి వేస్తున్నారని, పిల్లల్ని స్కూల్ యాజమాన్యం రావద్దంటున్నారని, వేరే పాఠశాలలో ఎవరు జాయిన్ చేసుకోవడం లేదని, తమ పిల్లల భవిష్యత్ ఏమిటని అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆమె పాఠశాలను సందర్శించారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించే విధంగా ఎంఇఒకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆరు నుండి పదవ తరగతి వరకు కూడా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి టిసిలు ఇచ్చినట్లు తెలిపారు.

కుల, మతాలకతీతంగా సమన్యాయం

కాకినాడ రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నట్లు మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో శుక్రవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణల ద్వారా సుమారు రూ.23 లక్షల 20 వేల సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కరప జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, కరప ఎంపిపి శ్రీలక్ష్మీ సత్తిబాబు, సూర్యరావుపేట సర్పంచ్ సూరాడ చిన్నిరాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో విద్యనభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గహాన్ని ఎంఇఒ-1 కె.కిరణ్ బాబు,ఎంఇఒ-2 ఎస్.సత్య కష్ణ లు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా వసతి గహంలోని విద్యార్థినిలకు అందిస్తున్న సదుపాయాలను వార్డెన్ బి.తులసిని వారు అడిగి తెలుసుకున్నారు. విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ వసతి గహంలో ఉన్న సదుపాయాలను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నతులుగా ఎదగాలని అన్నారు.

సాగు వివరాలను రైతులకు తెలియజేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామస్థాయిలో పనిచేస్తున వ్యవసాయసహాయకులు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామం పరిధిలోని రైతులకు,కౌలు రైతులకు సరైన సాగు పద్ధతుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ ఇళ్ల సూర్య నారాయణ అన్నారు. కె.గంగవరంలో వ్యవసాయ మండల సమావేశం శుక్రవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఎడిఎ ఎవిఎస్.రంగారావు మాట్లాడుతూ ప్రస్తుత తొలకరి పంటలో భాగంగా అందరూ కూడా ఈనెల జూలై 15 లోపు నారుమడులు వేసుకోవాలని నారుమడులు వేయని వారు జూలై 15 తర్వాత నుంచి నేరుగా వెదజల్లే పద్ధతిలో మాత్రమే పంట వేసుకోవాలన్నారు. ఆగస్టు 15 లోపు వరి నాట్లు కూడా పూర్తి చేయాలని దానికి అనుగుణంగా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపిపి నాగమణి మాట్లాడుతూ వరి వ్యవసాయంతో పాటు ప్రభుత్వం ఉచితంగా అందించే కందులను వరి గట్ల చుట్టూ పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందే దిశగా కూడా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందులు కావలసినవారు స్థానిక రైతు భరోసా కేంద్రాల వారిని సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బలుసు రవి మాట్లాడుతూ చిరుధాన్యాల పెంపకం ద్వారా అదనపు ఆదాయం మరియు తద్వారా వాటిని ఉపయోగించుకోవడం వల్ల మంచి ఆరోగ్యం రెండు కలుగుతాయని వివరించారు కార్యక్రమంలోఅన్ని గ్రామాల ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 22 ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రయివేట్ కళాశాలల అసోసియేషన్ పిలుపుతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విజయవంతమైంది. ఎకెఎన్‌యు కాలేజీస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నరసింహ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 22 రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో చాలా కళాశాలలను అనేక కారణాలు చూపించి మూసివేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ప్రభుత్వానికి చెల్లించే ఫీజులు పెంచుతూ, కళాశాలలకు చెల్లించే ఫీజులు తగ్గిస్తూ రావటాన్నీ తపప్పుబట్టారు. కార్యక్రమంలో యాలంగి వరప్రసాద్, కరాటం ప్రవీణ్, సూర్యకుమారి, కె.మనోహర్, బి.శ్రీనివాస్, జాన్‌పాల్, నాగరాజు, కె.వెంకటేష్, సంసొన్ తదితరులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

బడి బయట పిల్లలు పాఠశాల్లో చేరిక

ప్రజాశక్తి-మండపేట

స్థానిక వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బడి బయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.షాలెంరాజు ఆధ్వర్యంలో పాఠశాల్లో శుక్రవారం చేర్పించారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని ప్రభుత్వం పేద విద్యార్థుల కొరకు పథకాలు అమలు చేస్తున్నందున అందరూ వాటిని వినియోగించుకుని చదువుకుని విద్యావంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా బడి బయట పిల్లలు రాసూరి మేరి, రాసూరి గోగులమ్మలను తిరిగి పాఠశాల్లో చేర్పించారు. బడి బయట పిల్లలను గుర్తించి అటువంటివారిని విద్యా హక్కు చట్టం ద్వారా పాఠశాల్లో అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. హెచ్ఎం ఆర్.నాగకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సుధాకర్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల టిడిపి గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి సుధాకర్ పుట్టినరోజు వేడుకను శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. సుధాకర్‌ను పూలదండలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి నాయకులు యడ్లపల్లి తుక్కియ్య, పెట్టా కృష్ణ,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మామిడికుదురు

పగటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ లో ఉన్న చెట్లు కొమ్మలు తొలగింపు, మైనర్ రిపేర్ల నిమిత్తం శనివారం సరఫరా నిలివివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. మగటపల్లి, మామిడికుదురు, ఈదరాడ, కొమరాడ, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అధికారులు తెలిపారు.